క్లుప్తంగా

పంచాయతీలకు చెక్కుల పంపిణీ



జి.కొండూరు: స్థానిక కమ్యూనిటీహాలులో వరద ప్రభావిత గ్రామ పంచాయతీలకు ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేతులమీదుగా సర్పంచ్‌లు, అధికారులకు సోమవారం అందజేశారు. డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అందించిన ఈ ఆర్థిక సాయాన్ని మైలవరం నియోజకవర్గంలో 31, తిరువూరు నియోకవర్గంలో 20 గ్రామ పంచాయతీలకు, ఒక్కొక్క పంచాయతీకి రూ.లక్ష చొప్పున అందజేశారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలో సత్వర అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ) పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



తిరువూరు: ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవ సందర్భంగా తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక శ్రీనిధి స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఈ పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అక్షరాస్యత ఆవశ్యకతను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు వివరించారు. పోటీలలో విజేతలైన విద్యార్థులకు క్లబ్ నిర్వాహకులు బహుమతులు పంపిణీ చేశారు. శ్రీనిధి స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్, అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, నాగుబండి ప్రకాశరావు పాల్గొన్నారు.

అధిక నీటిని బయటకు మళ్లించాలి



చాట్రాయి: భారీ వర్షాలకు పొలాల్లో ఉన్న అధిక నీటిని బయటకు మళ్లించాలని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. సోమవారం మండలంలో నీట మునిగిన పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 వేల ఎకరాల్లో వరి, 220 ఎకరాల్లో పత్తి సాగు చేశారని చెప్పారు. అధిక నీటిని బయటకు మళ్లించిన తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలని దీని వలన పంట త్వరితగతిన పుంజు కుంటుం దన్నారు. ఒక గ్రాము కార్బండిజమ్, లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తెగుళ్లు ఆశించవని ఆయన పేర్కొన్నారు.

ముంపు నీరు డ్రెయినేజీకి మళ్లింపు



తిరువూరు: స్థానిక బైపాస్‌రోడ్ డ్రైవర్స్ కాలనీ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపునీరు నివాసగృహాల చుట్టూ చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వారం రోజులుగా డ్రైవర్స్ కాలనీలో వర్షపునీరు కదలకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. విషసర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా నీటి మళ్లింపునకు చర్యలు తీసుకోకపోవడంతో 9వ వార్డు కౌన్సిలర్ మూడు దుర్గారావు ఆధ్వర్యంలో యువకులు ట్రాక్టరు సహాయంతో నీటిని తోడే కార్యక్రమం సోమవారం చేపట్టారు. తీవ్ర అనారోగ్యంతో ఉన్న వృద్ధులు వైద్య సౌకర్యానికి కూడా నోచుకోక జలదిగ్బంధంలో ఉండటంతో కౌన్సిలర్ దుర్గారావు కోరిక మేరకు వార్డు శానిటేషన్ కార్యదర్శి వాడపల్లి రమేష్‌బాబు, పవన్ తదితరులు నీటిని డ్రెయినేజీకి మళ్లించేందుకు సహకరించారు.

వైద్య శిబిరం



ఆగిరిపల్లి: మండలంలోని సగ్గురు, సురవరంలో సోమవారం సగ్గురు పీహెచ్‌సీ వైద్యురాలు మంజుల దేవి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జ్వరాలు, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇంటి పరిసరాల చుట్టూ దోమలు వ్యాపించకుండా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రహదారులు ఛిద్రం

నూజివీడు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.1.30 కోట్ల మేర నష్టం



నూజివీడు-ముసునూరు మార్గంలో ఊటవాగు వద్ద దెబ్బతిన్న రోడ్డు



నూజివీడు-రావిచర్ల రోడ్డులో బోర్వంచ వద్ద ధ్వంసమైన రహదారి

నూజివీడు: భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తడంతో నూజివీడు నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారులు ఛిద్రమయ్యాయి. నూజివీడు- ముసునూరు రోడ్డు ఊటవాగు వద్ద, కొర్లగుంట సమీపంలోని వాగు వద్ద ధ్వంసమైంది. పట్టణంలోని బైపాస్ రోడ్డులో పలుచోట్ల మార్జిన్లు వరద ఉధృతికి కొట్టుకుపోయి అగాధంలా మారాయి. నూజివీడు-మైలవరం రోడ్డులో పెట్రోలు బంకు మలుపు వద్ద నుంచి ట్రిపుల్ ఐటీ గేటు వరకు అడుగడుగునా గుంతలమయమైంది. విస్సన్నపేట రోడ్డులో పెట్రోలు బంకు వద్ద రహదారి ఛిద్రమవ్వడంతో వాహనదారులకు నరకం కనిపిస్తోంది. నూజివీడు-రావిచర్ల మార్గంలో బోర్వంచ వద్ద, లీలానగర్-రమణక్కపేట మార్గంలో రెండు చోట్ల ఆర్‌అండ్‌బీరోడ్ల మార్జిన్లు కోతకు గురయ్యాయి. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.1.30 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.





నూజివీడు-గంపలగూడెం రోడ్డులో గొడుగువారిగూడెం వద్ద దెబ్బ తిన్న రహదారి ; నూజివీడు మండలం లీలానగర్-రమణక్కపేట మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

వరద బాధితులకు బాసటగా..

మైలవరం: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు ఆర్థికంగా నష్టపోయిన పేద ఆర్యవైశ్యులను ఆదుకోవాలని అధ్యక్షుడు బయన శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం గ్రామంలోని రామాలయం ప్రాంగణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద వారైన సంఘ సభ్యులకు నిత్యావసర సరకులు సంఘం పెద్దల ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కాజా మహేష్, పెద్దలు చారుగుళ్ల ప్రసాద్, జూలకంటి ప్రసాద్, నాగరాజు, కృష్ణమూర్తి, జూలూరు ఉమామహేశ్వరరావు, మిరియాల జగన్, అనుమోలు అప్పారావు, చలవాది మధు పాల్గొన్నారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడలో బుడమేరు వరదముంపు బాధితులకు కొండపల్లికి చెందిన గ్లోబల్ గాస్పెల్ ఆవుట్‌రీచ్ ట్రస్ట్ చర్చి పాస్టర్ చింతల అబ్రహం బాసటగా నిలిచారు. అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లో మోకాళ్ల లోతుకు పైగా నీటిలో వెళ్లి ఆహారం బాక్స్‌లు, వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు సోమవారం పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం ఇసుకరేవు ప్రాతంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు వరదముంపు బాధితులకు అన్నదానం చేశారు. గడిచిన మూడు రోజులుగా జగనన్న కాలనీ, ఫెర్రీ తదితర గ్రామాల్లో అన్నదానం చేశామన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకులు ఆలేటి విఠల్‌రావు, మహేష్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: బెజవాడలో నీట మునిగిన ప్రజలకు ఆగిరిపల్లి చెందిన యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అండగా నిలుస్తున్నారు. స్థానిక మీ సేవ నిర్వాహకుడు పల్లగాని నాగబాబు, అతని స్నేహితులు పల్లగాని శేఖర్, సాయి ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి వరద బాధితులకు సహాయం చేస్తున్నారు. విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి బాధితులకు బిర్యానీ ప్యాకెట్లు, బిస్కెట్లు, అరటిపళ్లు, వాటర్ బాటిల్స్, మహిళలకు శానిటరీ ప్యాడ్స్‌ను వారం రోజుల నుంచి 500 మందికి అందజేశారు.



పేద ఆర్యవైశ్యులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సంఘ సభ్యులు



విజయవాడ వాంబేకాలనీలో బాధితులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పాస్టర్ చింతల



పైడూరుపాడు గ్రామస్తులకు తాగునీటిని అందిస్తున్న చెరుకూరి శ్రీనివాసరావు



రాయనపాడులో బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జడ్జీలు ఎ.సత్యానంద్, పి.శ్రీధర్

వైఎస్సార్ సీపీ నేత సహకారంతో తాగునీటి సరఫరా

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల కన్వీనర్ చెరుకూరి శ్రీనివాసరావు తన సొంత ట్రాక్టరుతో వరద ప్రభావిత ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తూ మానవత్వాన్ని చాటారు. గత ఐదు రోజులుగా జి.కొండూరు మండల పరిధి కవులూరు, విజయవాడ రూరల్ పరిధి పైడూరుపాడుకు రోజుకు మూడు ట్యాంకర్ల చొప్పున జి.కొండూరు నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వరదల వలన గ్రామాలలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న నరకయాతన చూసి చలించిపోయి ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఫుడ్ ప్యాకెట్ల పంపిణీ

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామం పునరావాస కేంద్రంలో వరద బాధితులు 200 మందికి సోమవారం సాయంత్రం ఫుడ్‌ప్యాకెట్లు, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జీ, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానంద్, కమర్షియల్ కోర్ట్ జడ్జి పి.శ్రీధర్, గవర్నమెంట్ ప్లీడర్ చిన్నం రామకృష్ణ, న్యాయవాది ఎస్.పూర్ణచంద్రరావు, వీఆర్వో ఆర్.చంద్రశేఖర్‌శర్మ, శీలంనేని సాంబశివరావు, పోలసాని సుబ్బారావు గ్రామస్తులు పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



నూజివీడు బొందిలిపేట గంగానమ్మ గుడి వద్ద..



నూజివీడు కోనేరుపేట టీటీడీ కల్యాణ మండపంలో..



తిరువూరు ఆర్టీసీ కాలనీలో గణపతికి భక్తుల పూజలు



తిరువూరు రేగలగడ్డ బజారులో గణపతి విగ్రహానికి పూజలు



రాజుపేట సూర్యా రెస్టారెంట్ రోడ్డులో మట్టి గణపతి విగ్రహం

తిరువూరు: నూజివీడు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు సోమవారం కొనసాగుతున్నాయి. తిరువూరు పట్టణంలోని పలు కూడళ్లలో పూజలు నిర్వహించారు. బైపాస్‌రోడ్ ఆర్టీసీ కాలనీ, రాజుపేట రేగుల గడ్డ బజార్లలో భక్తబృందం ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు విశేష పూజలు చేశారు. సూర్య రెస్టారెంట్ సెంటర్‌లో మట్టి గణపతి ప్రతిమ ఏర్పాటు చేశారు. తొమ్మిది రోజుల పాటు స్వామివారికి పూజాదికాలు నిర్వహించి నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పశువైద్య శిబిరం

తిరువూరు: పశువులకు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులకు తక్షణ వైద్య చికిత్స చేయించాలని మండల పశువైద్యాధికారి టీ శ్వేత సూచించారు. మల్లేలలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తుపాను కారణంగా అనారోగ్యం బారిన పడిన పశువులకు, జీవాలకు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పాడి గేదెల్లో పొదుగు వాపు, గాలికుంటు, గురక, పేగు సంబంధ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైవ్‌స్టాక్ అధికారి గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. 100 పశువులకు వైద్య పరీక్షలు చేశారు.

13న హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన హుండీ కానుకలను ఈ నెల 13న ఉదయం 10 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వై.సీతారామయ్య సోమవారం తెలిపారు. దేవదాయశాఖ అధికారి పర్యవేక్షణలో రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామ పెద్దల సమక్షంలో దేవస్థానం హుండీలో కానుకలు లెక్కిస్తామని ఈఓ తెలిపారు.

కమిటీలు అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: వినాయక విగ్రహాల నిమజ్జన విషయంలో నవరాత్రి కమిటీలను అప్రమత్తం చేసి, ప్రమాదాలను నివారించాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ సూచించారు. సోమవారం అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా 76 వినాయక నవరాత్రి పందిళ్లు ఏర్పాటయ్యాయని, ఉత్సవ కమిటీల బాధ్యులు తగిన జాగ్రత్తలు పాటించేలా అందరినీ అప్రమత్తం చేయాలన్నారు. చెరువులు, జలాశయాలు నిండి ఉన్నందున వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించేలా అప్రమత్తం చేయాలన్నారు. గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డీటీ ఎమిలీకుమారి, ఎంపీడీఓ జి.రాణి, ఏ.ఓ సాయిరామ్, హెడ్ కానిస్టేబుల్ శివనాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

తండాలో పారిశుద్ధ్య పనులు

లంబాడీతండా(విస్సన్నపేట): మండలంలోని చంద్రుపట్ల లంబాడీ తండా గ్రామ పంచాయతీ పరిధిలో వర్షాలకు అంటు వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ ఆధ్వర్యంలో పలువీధుల్లో బ్లీచింగ్ చల్లించినట్లు సర్పంచ్ దారావతు బోడి సోమవారం తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యదర్శి మధు పనులను పర్యవేక్షించారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



నందిగామ టౌన్: వినాయక నిమజ్జన కార్యక్రమాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి సమీపంలోని మున్నేటి బ్రిడ్జిపై వినాయక నిమజ్జన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సూచనల మేరకు నిమజ్జనానికి అనుమతిస్తామన్నారు. ముఖ్యంగా మున్నేటికి వరద ఉధృతి అధికంగా ఉన్నందున వినాయక నిమజ్జనాల నిమిత్తం లోతులోకి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఫణిశ్రీనివాసరావు, ఎస్ఐ శాతకర్ణి పాల్గొన్నారు.

అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ వైఫల్యం

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ సర్నాల తిరుపతిరావు



మైలవరం: ప్రకృతి వైపరీత్యాలు, వరదలు వచ్చే సమయంలో వాతావరణ శాఖ, నీటి పారుదల విభాగం ముందస్తు హెచ్చరికలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే మైలవరం నియోజకవర్గానికి భారీ నష్టం జరిగిందని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ సర్నాల తిరుపతిరావు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. వాతావరణ శాఖ, నీటి పారుదల విభాగం చేసిన ముందస్తు హెచ్చరికలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకుని ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ప్రజలను అప్రమత్తం చేయలేదు సరికదా ఆపద సమయంలో సహాయక చర్యలు కూడా చేపట్టలేకపోవడం ప్రభుత్వ వైఫల్యాన్ని తెలియజేస్తోందన్నారు. కనీసం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న వారిని ఖాళీ చేయించే ప్రయత్నం చేయలేకపోయింది. కరకట్టపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇల్లు మునిగిపోకుండా కాపాడేందుకు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా చూసేందుకు బుడమేరు నుంచి వరద నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారు. దీని వలన ఇంత ఘోరమైన పరిస్థితి ఏర్పడింది. వరదలు ముంచెత్తినా ప్రజలు తమకు తాముగా సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నంలోనే 50 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాలు కాపాడుకున్న కుటుంబాలకు కనీసం తాగునీరు, ఆహారం, పిల్లలకు పాలు బోట్ల ద్వారా చేరవేసే ప్రయత్నం చేయలేదు. నీరు లేని ప్రాంతాల్లో మాత్రమే అరకొరగా నీరు, ఆహారం అందజేశారు. వర్షం, వరద తగ్గు ముఖం పట్టిన తరువాత కూడా కనీస వసతులు కల్పించలేకపోయారన్నారు. ఎనిమిది రోజుల పాటు లక్షల మంది ప్రజలు నరకయాతన అనుభవించడం, రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే విజయవాడలోనే ఈ పరిస్థితి నెలకొందంటే ప్రభుత్వం పనితీరు అర్థమవుతోంది. సీఎం చంద్రబాబు అధికారులను వెంటవేసుకుని తిరగటం తప్ప, వారికి పూర్తి బాధ్యతలు అప్పగించి, పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదన్నారు. ప్రతి రోజు ప్రెస్ మీట్‌లు పెట్టి కాలయాపన చేసి, అంతా తానే చేసినట్లు చెప్పుకోవడానికే ప్రయత్నం చేశారని తెలిపారు. చంద్రబాబు ప్రచారం కోసం పాకులాడటం మానాలని కోరారు. రాష్ట్ర ప్రజలు ఈ విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

చెరువుల గండ్లను పటిష్టంగా పూడ్చాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు



చంద్రాల చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు

మైలవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వలన మైలవరంలో చెరువులకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి మండలంలోని చంద్రాల గ్రామంలో మంతెన చెరువు (ఊర చెరువు)ను, పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అడ్డగోలుగా చెరువు కట్టలకు ర్యాంపులు వేసి మట్టిని అక్రమంగా తరలించడం వల్లే చెరువుల కట్టలు తెగాయని పలువురు రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ఈ కారణంగానే బుడమేరు పొంగిందన్నారు. అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో బుడమేరు ద్వారా విజయవాడ మరొకసారి వరద ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, డైవర్షన్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రాప్‌తో సంబంధం లేకుండా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. బుడమేరు ముంపును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రాజకీయాలతో సంబంధం లేకుండా అధికార, ప్రతిపక్షాలు కేంద్రంపై వత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావలసిన నష్టపరిహారాన్ని సంపాదించుకోవాలని తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రావూరి రమేష్ బాబు, నాయకులు రావుల సుబ్బారావు, చంద్రాల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి



అక్కినేని చిట్టిబాబు

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అక్కినేని చిట్టిబాబు (75) సోమవారం మృతి చెందారు. చిట్టిబాబు కొంతకాలంగా అస్వస్థతతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చిట్టిబాబు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. చిట్టిబాబుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన కుమారుడు అక్కినేని ప్రేమసాయి వైఎస్సార్ సీపీ నాయకుడు కాగా, కోడలు అక్కినేని శ్రీవాణి నూజివీడు మండల పరిషత్ వైస్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య చిట్టిబాబు అంత్యక్రియలు నిర్వహించారు.

నిమజ్జనానికి కృష్ణానది వద్ద ఏర్పాట్లు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని కృష్ణానది వద్ద యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం ఫంటు ఏర్పాటు చేసినట్లు ఈఓ హేమలతాదేవి తెలిపారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఈ ప్రాంతం నుంచే కాకుండా తెలంగాణ నుంచి కూడా గణపతి విగ్రహాలు నిమజ్జనం చేస్తారని పేర్కొన్నారు. దీంతో నదిలో ఫంటు ఏర్పాటు చేశామన్నారు. పోలీసుల సూచనల మేరకు గజ ఈతగాళ్లతో పాటు ఆలయ సిబ్బంది కూడా నది వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. నదికి వరద వస్తుండటంతో పోలీసుల సూచనల మేరకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు.

సేంద్రియ సాగుతో ప్రయోజనాలనేకం



తిరువూరు వాహినీ కళాశాలలో ప్రకృతి సేద్యంపై విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రసాద్

తిరువూరు: రసాయన ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల సాగుతో ఎక్కువ ప్రయోజనాలున్నాయని ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ప్రసాద్ సూచించారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం 'రేపటి ఆరోగ్యం కోసం స్థిరమైన పోషకాహారం' అనే అంశంపై సదస్సు జరిగింది. ప్రకృతి ఎన్నో విలువైన సహజవనరులను అందిస్తున్నప్పటికీ రసాయన ఎరువులను అధికమోతాదులో వినియోగించి మనమే నష్టం కలగజేసుకుంటున్నామన్నారు. సేంద్రియ ఎరువులతో సాగు రైతుకు లాభం,ప్రజలకుఆరోగ్యాన్ని అందిస్తుందని సూచించారు. విద్యార్థులు విదేశీ విద్య, ఉద్యోగ మోజులో పడకుండా ఉన్న ఊరిలో ప్రకృతి సేద్యం చేసి అధిక లాభాలు గడించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కరస్పాండెంటు పోట్రు నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నేరుకు పెరుగుతున్న వరద



కంచికచర్ల మండలం కీసరలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

కంచికచర్ల: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని కీసర మున్నేరుకు సోమవారం వరద పోటెత్తింది. తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం, వరంగల్, వైరాలో కురుస్తున్న వర్షాలకు వరదనీరు చేరింది. మున్నేరు సమీపంలో ఉన్న పంట పొలాలన్నీ నీట మునిగాయి. మండలంలోని వేములపల్లి, ఎస్. అమరవరం గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లు నీటిలో మునిగాయి. మున్నేరు ఏటిపట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వీ జాహ్నవి పేర్కొన్నారు.